జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 11 ‖ శనివారం ‖ 26-9-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



26 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:05 తిథి పౌర్ణమి రా. 10:14 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర ఉ. 11:20 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం గండ మ. 1:10 వరకు కరణం విష్టి ఉ. 10:44 వరకు బవ రా. 10:14 వరకు వర్జ్యం రా. 8:58 నుండి రా. 10:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:37 నుండి మ. 3:06 వరకు గుళికాకాలం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:31 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున





# తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం

## లక్కవలస, మరువాడ గ్రామాల్లో మంత్రి పర్యటన

## నష్టపోయిన కుటుంబాలకు ధైర్యం చెప్పిన అచ్చన్నాయుడు

## తక్షణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు

సంతబొమ్మాళి, సెప్టెంబర్ 25: తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన సంతబొమ్మాళి మండలంలోని లక్కవలస, మరువాడ గ్రామాల్లో రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు పర్యటించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లక్కవలస గ్రామంలో తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన మంత్రి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇళ్ల నష్టం కారణంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను వెంటనే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి కొత్త ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీఓకు సూచించారు. (మిగతా 2వ పేజీలో)



# లోకల్ ఫీవర్

## ఏపీ లోకల్ ఫైట్.. గెలుపు గుర్రాల అన్వేషణ

## కూటమిలో సీట్ల సర్దుబాటుపై ఉత్కంఠ

## గెలుపు గుర్రాల అన్వేషణలో పార్టీలు

## గ్రౌండ్ బలం నిలబెట్టుకునే పనిలో వైసీపీ

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వరకు అన్ని స్థాయిల్లోనూ రాజకీయ పార్టీలు తమ బలాబలాలను లెక్కించుకుంటున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ స్థానిక పోరు.. పార్టీలు తమ కేడర్‌ను ఎంతవరకు కాపాడుకున్నాయి? గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఎవరి సంస్థాగత బలం ఎంత? అనే ప్రశ్నలకు ఒక పరీక్షగా మారుతోంది. అందుకే ఈ ఎన్నికలను కేవలం స్థానిక పరిపాలన కోసం జరిగే ఎన్నికలుగా కాకుండా.. రాష్ట్ర రాజకీయాల్లో పార్టీలు తమ ప్రస్తుత స్థితిని అంచనా వేసుకునే వేదికగా కూడా చూస్తున్నాయి. అయితే ఎన్నికల షెడ్యూల్, పూర్తి స్థాయి స్థానాల వారీ పోటీ ఇంకా ఖరారు కావాల్సి ఉండటంతో, ప్రస్తుతం ప్రధాన పార్టీల దృష్టి అభ్యర్థుల అన్వేషణ, క్షేత్రస్థాయి బలాబలాల పైనే ఉంది.

ఇక అధికార కూటమిలో అసలు ఆసక్తి సీట్ల సర్దుబాటు చుట్టూనే ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాల్సి ఉండటంతో.. ఏ పార్టీ ఏ ప్రాంతంలో పోటీ చేయాలి? అన్నదే కీలక ప్రశ్నగా మారింది. జనసేన ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతీ నియోజకవర్గంలో తమ బలం, బలహీనతలను అంచనా వేస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో ముందుగా బలాలను గుర్తించాలని పార్టీ నాయకత్వం సూచించింది. తాజాగా నాదెండ్ల మనోహర్ కూడా తుది సీట్లు, అభ్యర్థులు ఇంకా ఖరారు కాలేదని, గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల్లోనే పోటీకి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా కూటమి మూడు పార్టీలూ క్షేత్రస్థాయి బలాన్ని అంచనా వేస్తున్నాయని, ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలన్న తుది నిర్ణయం తరువాయి 2 వ పేజీలో..



# జిల్లా అభివృద్ధి పనులపై డీఆర్సీ సమీక్ష

## ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యల చర్చ

## సాగునీరు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

## సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి



**నరసరావుపేట, సెప్టెంబర్ 25 :**
నరసరావుపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. రహదారులు, తాగునీటి పథకాలు, (మిగతా 2వ పేజీలో)



# 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల అర్జీల స్వీకరణ

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

## కలెక్టర్‌తో కలిసి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే రాము

## నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు

**గుడివాడ, సెప్టెంబర్ 25 :**
గుడివాడ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో నిర్వహించిన ప్రత్యేక 'మీకోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాలాజీతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు, ఆదాయ ధృవపత్రాలు, గృహ నిర్మాణం, తాగునీరు తదితర అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.



# 45 కుటుంబాలకు ఉచిత ఇళ్ల పట్టాలు

## సెప్టెంబర్ 30న సీఎం చేతుల మీదుగా పంపిణీ

## పేదల సొంతింటి కల సాకారం: తంగిరాల సౌమ్య

## నందిగామలో భూముల క్రమబద్ధీకరణకు ఊతం

**నందిగామ, సెప్టెంబర్ 25 :**
పేదలు, సామాన్యుల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం:** ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకుంటాయి, పై అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. చేపట్టిన ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి, నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉంటుంది, నూతన వస్తువులు లేదా గృహోపకరణాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం మంచిది. తోబుట్టువుల నుండి ఆశించిన మద్దతు లభిస్తుంది.

**మిధునం:** పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో పనులను సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారంలో భాగస్వాములతో మాట్లాడేటప్పుడు తొందరపాటు పనికిరాదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది, దైవదర్శనాలు చేసుకుంటారు.

**కర్కాటకం:** సమాజంలో మీ గౌరవ మర్యాదలు పెరుగుతాయి, అనుకోని విధంగా ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. మిత్రులతో కలిసి విందు వినోదాలలో పాల్గొంటారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న పనులు సజావుగా సాగుతాయి.

**సింహం:** సమాజంలో నూతన పరిచయాలు ఏర్పడతాయి, ఇవి భవిష్యత్తులో మీ వ్యాపార అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. కోపాన్ని నియంత్రించుకోవడం వల్ల బంధాలు దెబ్బతినకుండా ఉంటాయి.

**కన్య:** వృత్తి ఉద్యోగాల్లో బదిలీలు లేదా పదోన్నతల సూచనలు కనిపిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు చాలా వరకు తొలగిపోయి ఆదాయం నిలకడగా ఉంటుంది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది, ఆరోగ్యం సహకరిస్తుంది.

**తుల:** చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి, కాబట్టి ఓర్పుతో వ్యవహరించడం అవసరం. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. ముఖ్యమైన విషయాల్లో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది.

**వృశ్చికం:** మీరు పడిన శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. పాత మిత్రులను అనుకోకుండా కలుసుకోవడం వల్ల మనస్సుకు ఎంతో ఆనందం కలుగుతుంది. ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది, నూతన పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన రోజు.

**ధనస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి, ఆకస్మిక లాభాలు ఉంటాయి. బంధువుల నుండి ఒక శుభవార్త వింటారు. ఇంట్లో సంతోషకరమైన, ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంటుంది, ప్రయాణాలు కలసివస్తాయి.

**మకరం:** అనవసర వివాదాలకు, ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం మంచిది. కార్యాలయంలో సహోద్యోగులతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలున్నాయి. ఖర్చుల విషయంలో బడ్జెట్ ప్రకారం నడుచుకోవడం ఎంతైనా అవసరం.

**కుంభం:** వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక ఋణ భారం పెరుగుతుంది. ఇంటా బయటా ఊహించని సమస్యలు కలుగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అంతగా అనుకూలించవు. సంతాన అనారోగ్యం విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

**మీనం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు కలుగుతాయి. ఆప్తులతో శుభాకార్యాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. విద్యార్థులు పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభలు అందుకుంటారు. దైవ చింతన పెరుగుతుంది.



# 45 కుటుంబాలకు ఉచిత ఇళ్ల పట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

భూముల క్రమబద్ధీకరణ పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2019కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్న వారు, ఇంటి పన్ను రసీదులు కలిగి దరఖాస్తు చేసుకున్న వారిని పరిశీలించిన అనంతరం 45 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ లబ్ధిదారులకు సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నామని తంగిరాల సౌమ్య చెప్పారు. 150 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 150 చదరపు గజాలకు మించిన స్థలాలకు ప్రభుత్వ మార్కెట్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు.

ఈ 45 మంది లబ్ధిదారులకు సంబంధించిన ప్రభుత్వ భూమి మొత్తం 3,746.68 చదరపు గజాలు ఉండగా, దాని మార్కెట్ విలువ సుమారు రూ.3.91 కోట్లుగా అంచనా వేయబడిందని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారుల్లో 39 మంది బీపీఎల్ కుటుంబాలకు చెందినవారని, 6 మంది ఏపీఎల్ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. కులాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాలకు చెందిన కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశంతో భూమిపై చట్టబద్ధమైన హక్కు లభించడంతో పాటు కుటుంబాల ఆర్థిక భద్రత కూడా పెరుగుతుందని ఆమె అన్నారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయిన రెండేళ్ల తర్వాత లబ్ధిదారులు తమ నివేశన స్థలాలను విక్రయించుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. భూమి హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారికి కూడా అవకాశం కల్పించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 2019కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఇంటి పన్ను రసీదులు కలిగి ఉన్న వారు 2026 డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని భూమిపై చట్టబద్ధ హక్కులు పొందాలని తంగిరాల సౌమ్య కోరారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

గుంటూరు, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద అమలు చేస్తున్న భద్రతా చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవీఎంలు నిల్వ ఉంచిన గదుల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థలను కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్‌కు అమర్చిన తాళాలు, సీల్స్, ప్రవేశ నియంత్రణ విధానాలను తనిఖీ చేసి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా సాంకేతికంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. పర్యవేక్షణ వ్యవస్థలో ఏదైనా లోపం తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అక్షరాలా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనుమతి లేని వ్యక్తులు గోడౌన్ పరిసరాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. భద్రతా వ్యవస్థలో ఎలాంటి లోపాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ కూడా అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈవీఎంలకు సంబంధించిన అన్ని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించి భద్రంగా నిర్వహించాలని సూచించారు. తనిఖీలు, పర్యవేక్షణ, భద్రతా చర్యలకు సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో అవసరమైన సమాచారాన్ని వెంటనే అందించేలా రికార్డులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు గోడౌన్ భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరాలు అందించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రతను మరింత పటిష్ఠంగా నిర్వహించాలని కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సూచించారు.

# పోలేరమ్మ జాతరకు ఘన ఏర్పాట్లు

నెల్లూరు, సెప్టెంబర్ 25 : నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గ్రామశక్తి స్వరూపిణి శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి అక్టోబర్ 1 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతరకు ప్రత్యేక ఆహ్వానం అందించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవస్థాన పాలక మండలి సభ్యులు, పట్టణ ప్రముఖులు, దేవాదాయ శాఖ అధికారులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి జాతర వెంకటగిరి ప్రాంతంలో అత్యంత ప్రాచీనమైన, విశిష్టమైన ఆధ్యాత్మిక ఉత్సవంగా గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ మహోత్సవాన్ని ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. జాతర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో పాటు దేవస్థాన ప్రతినిధులు, అధికారులు మంత్రిని కలిసి వివరించారు. భక్తుల రాకపోకలు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

# తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

తుఫాన్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం మంత్రి గ్రామస్తులతో సమావేశమయ్యారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, నివాస సదుపాయాలకు సంబంధించిన ఇబ్బందులను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపడుతుందని మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. అనంతరం మరువాడ గ్రామంలో నీట మునిగిన ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. గ్రామ ప్రజలతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను అంచనా వేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో నివారణ చర్యలు మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ భూములు, పంటలకు జరిగిన నష్టాన్ని కూడా అధికారులు సమగ్రంగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరిగినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. పంట నష్టం, గృహ నష్టం, మౌలిక సదుపాయాల నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అచ్చన్నాయుడు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.



# లోకల్ ఫీవర్

మొదటి పేజీ తరువాయి

ఇంకా కాలేదని చెప్పారు. అంటే కూటమిలో ఇప్పటి వరకు ప్రధానంగా జరుగుతున్నది సీట్ల కోసం పోటీ కంటే.. ప్రతి స్థానంలో ఎవరి సంస్థాగత బలం ఎంత అన్న లెక్కలు తేల్చే ప్రక్రియ అనుకోవచ్చు.జనసేన విషయానికి వస్తే.. ఈసారి స్థానిక ఎన్నికలను పార్టీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ పార్టీ బలంగా ఉన్న చోట పోటీ చేయాలని, పోటీ చేసిన స్థానాల్లో పూర్తి స్థాయి విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అనంతపురం వంటి పట్టణ ప్రాంతాల్లో పార్టీకి అవకాశం ఉన్న స్థానాలపై స్థానిక నేతలు ఆసక్తి చూపుతున్నారనే చర్చ ఉంది. అయితే ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది. ఒక పార్టీకి రాష్ట్రస్థాయిలో ఉన్న రాజకీయ ప్రాధాన్యం, స్థానిక ఎన్నికల్లో అదే స్థాయిలో ఓట్లుగా మారుతుందని చెప్పలేం. వార్డు స్థాయిలో కేడర్, అభ్యర్థి వ్యక్తిగత బలం, స్థానిక సామాజిక సమీకరణాలు, గత ఎన్నికల ఓటింగ్, ప్రత్యర్థి బలం.. ఇవన్నీ కలిపే సీటు ఎంపిక జరగాల్సి ఉంటుంది. అందుకే జనసేన కోరుకునే ప్రతి స్థానాన్ని కూటమిలో సులభంగా వదులుతారా? లేక స్థానిక బలాబలాల ఆధారంగా సర్దుబాటు చేస్తారా? అన్నది రాబోయే చర్చల్లో కీలకం.ఇక ప్రతిపక్ష వైసీపీకి ఈ ఎన్నికలు మరో రకమైన పరీక్ష. 2024 తర్వాత అధికారానికి దూరమైన పార్టీకి గ్రామస్థాయి కేడర్‌ను తిరిగి యాక్టివ్ చేయడం, నియోజకవర్గ ఇంచార్జ్ లను సమన్వయం చేయడం, స్థానిక నాయకత్వాన్ని నిలబెట్టుకోవడం ప్రధాన సవాళ్లు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పటికే ప్రతీ స్థానిక సంస్థ సీటులో పోటీకి సిద్ధం కావాలని, ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకూడదని పార్టీ నేతలకు సూచించారు. నియోజకవర్గం వార్డు స్థాయిలో ముందుగానే అభ్యర్థులను గుర్తించాలని కూడా ఆదేశించారు. అంటే వైసీపీ వ్యూహం స్పష్టంగా "గ్రౌండ్‌లో కనిపించాలి" అన్న దిశలో ఉంది. అయితే ఆ వ్యూహాన్ని అమలు చేయడంలో నియోజకవర్గాల వారీగా ఉన్న అంతర్గత సమీకరణాలు, అభ్యర్థుల లభ్యత, స్థానిక నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఏకగ్రీవాలకు వ్యతిరేకంగా పార్టీ అధినేత ఇచ్చిన ఆదేశం కూడా క్షేత్రస్థాయిలో అభ్యర్థులను నిలబెట్టే ప్రక్రియకు ఎంతవరకు బలం ఇస్తుందో చూడాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికల్లో అసలు ఆసక్తికరమైన అంశం ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారు? అన్నదే. జనసేన తనకు బలమున్న ప్రాంతాల్లో ఎక్కువ స్థానాలు కోరుతోంది. టీడీపీకి చాలా నియోజకవర్గాల్లో పాత కేడర్, స్థానిక నాయకత్వం ఉంది. బీజేపీ కూడా తన సంస్థాగత స్థాయిని పెంచుకునే అవకాశంగా స్థానిక ఎన్నికలను చూస్తోంది. మరోవైపు వైసీపీకి గతంలో ఉన్న గ్రామస్థాయి నెట్‌వర్క్‌ను నిలబెట్టుకోవడం, కొత్త అభ్యర్థులను ముందుకు తీసుకురావడం కీలకం. అందుకే ఒకే నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థాయిలో ఒక పార్టీ బలంగా ఉండొచ్చు.. కానీ వార్డు లేదా మండల స్థాయిలో సమీకరణాలు భిన్నంగా ఉండే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికల ప్రత్యేకత ఇదే.

# జిల్లా అభివృద్ధి పనులపై డీఆర్సీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు స్థితిగతులను అధికారులు వివరించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వవద్దని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొనే అవకాశమున్న వర్షాభావ పరిస్థితులపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాగునీటి వనరుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంపై ప్రభావం తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనుల అమలులో వేగం పెంచాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాలోని పలు అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు.

# శ్వేత సంపాదకీయం

**శుక్రవారం 25-9-2026**

## ప్రజా పాలనకు కేరళ గుర్తింపు

### యువ నాయకుడు రేవంత్ రెడ్డికి మరో గౌరవం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు జాతీయ స్థాయిలో మరో గుర్తింపు లభించింది. కేరళలోని ప్రముఖ ఆర్యాడన్ మహమ్మద్ ఫౌండేషన్ ప్రదానం చేసే లిఆర్యాడన్ మహమ్మద్, 2026 ఉత్తమ ప్రజా సేవకుడులి అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. నిలంబూర్ లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు కేరళ ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ దిగ్గజం ఆర్యాడన్ మహమ్మద్ జ్ఞాపకార్థం ఈ అవార్డును ఇస్తారు. ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏపీ అనిల్ కుమార్, మేధావి కల్పెట్ట నారాయణన్ లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఎంపిక చేసింది. లిరైతుల సంక్షేమం, బీసీల అభ్యున్నతి, సామాన్య ప్రజల కోసం చేపట్టిన వినూత్న పథకాలు, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండటంలి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ ఆర్యాడన్ షౌకత్ ప్రకటించారు. ఇది తెలంగాణకే గర్వకారణం

రేవంత్ రెడ్డిలో కనిపించే మొదటి సానుకూల అంశం, లిపాజిటివ్ దృక్పథంలి విమర్శలను కూడా స్పోర్టివ్ గా తీసుకోవడం, ఎదుటివారిని కలుపుకుని పోవడం ఆయన శైలి. ప్రతిపక్ష నాయకులతోనైనా, సొంత పార్టీలోని సీనియర్లతోనైనా, సామాన్య కార్యకర్తతోనైనా ఒకే విధంగా కలివిడిగా ఉండే ఫ్రెండ్లీ నేచర్ ఆయన బలం. ముఖ్యమంత్రి అనే దర్పం లేకుండా, ఎవరైనా కలవొచ్చు అనే భావన ప్రజల్లో కల్పించారు

రెండోది,లిప్రోగ్రెసివ్ అవుట్ లుక్లి. గత పాలనకు భిన్నంగా లిప్రజా పాలనలి అనే మాటను నిజం చేశారు. ప్రగతి భవన్ గేట్లు తెరిచి, దాన్ని ప్రజా భవన్ చేయడం ఒక సంకేతం. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ ఆలోచన, ఇవన్నీ ఒక ముందుచూపు ఉన్న నాయకుడి ఆలోచనలు

మూడోది, లిపీపుల్ ఫ్రెండ్లీ అడ్మినిస్ట్రేషన్లి. ప్రజా వాణి కార్యక్రమం ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించడం, కలెక్టర్లకు, ఎస్పీలకు జవాబుదారీతనం పెంచడం, కార్పొరేట్ శక్తులకు దూరంగా ఉంటూ, పేదలకు దగ్గరగా ఉండే పాలన అందించడం ఆయనకు మంచి పేరు తెచ్చింది అయితే, ఈ సానుకూల పాలనకు మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉంది, అదే లిఅవినీతిపై ఉక్కుపాదంలి గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో ాజాదీ దాడులు పెరిగాయి. ఇంజనీర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు లక్షల్లో లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములపై కూడా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అక్రమాలు బయటపడుతున్నాయి ప్రజా పాలన అంటే కేవలం పథకాలు ఇవ్వడం మాత్రమే కాదు, ప్రజల సొమ్మును దోచుకునే వారిని శిక్షించడం కూడా. ముఖ్యమంత్రి ఈ విషయంలో మరింత కఠినంగా ఉండాలి. ాజాదీ కి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి, ఎంత పెద్ద నాయకుడు, ఎంత పెద్ద అధికారి అయినా అవినీతి చేస్తే వదిలేది లేదు అనే సంకేతం బలంగా వెళ్లాలి. అప్పుడే కేరళ నుండి వచ్చిన ఈ లిబెస్ట్ పబ్లిక్ సర్వెంట్లి అవార్డుకు నిజమైన సార్థకత చేకూరుతుంది రేవంత్ రెడ్డి ఒక నాయకుడిగా ఎదుగుతున్నారు. కష్టాల నుండి వచ్చిన వ్యక్తిగా ప్రజల కష్టం ఆయనకు తెలుసు. ఆ సానుకూల దృక్పథం, ప్రోగ్రెసివ్ ఆలోచన, అందరితో కలిసిపోయే మనస్తత్వం, వీటికి అవినీతిపై కఠిన వైఖరి కూడా తోడైతే, తెలంగాణ ప్రజా పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.



## సీఈసీని వెంటనే భర్తరఫ్ చేయాలి : సిపిఎం

### ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా ఈసీఐఎల్ చౌరస్తాలో సిపిఎం ధర్నా

కాప్రా, సెప్టెంబర్ 25 (స్టార్ న్యూస్): సర్ పేరుతో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే భర్త రఫ్ చేయాలని సిపిఎం పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన ప్రదర్శనను నిర్వహించడం జరిగింది. కాప్రా సర్కిల్ కార్యదర్శి జి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఏ.అశోక్ మాట్లాడుతూ సి ఈ సి లో వున్న కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండానే సర్ పై స్వతంత్ర నిర్ణయాలు చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తీసుకున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమారుని వెంటనే భర్త రఫీ చేయాల ని లేనిచో దేశవ్యాప్తంగా నిరసన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్ మరియు పార్టీ నాయకులు జి.యాదగిరిరావు, శ్రీమన్నారాయణ, సిహెచ్ ప్రసాద్, పీ.గణేష్, ఎమ్మెస్‌రావు, కె.వి చారి, సిహెచ్ దేవిరెడ్డి, చల్లా లీలావతి, ఉన్ని కృష్ణ, జివిరావు, శోభ,శారద, గౌసియా, శివరామకృష్ణ, ఆర్.ఎస్.ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



చక్రిపురంలో రెబల్స్ యూత్ ఆధ్వర్యంలో కొలువైన గణనాధుని పూజలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నెమూరి మహేష్ గౌడ్, చక్రిపురం కాలనీ గౌరవ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి,రంజిత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కరణ్, శశాంక్, వెంకటేష్ గుప్తా, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## నాచారంలో ఘనంగా వినాయక విగ్రహాలకు స్వాగతం

### హెచ్ఎంటీ నగర్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత వేదిక

నాచారం, సెప్టెంబర్ 25: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాచారం శాఖ ఆధ్వర్యంలో హెచ్ఎంటీ నగర్ ప్రధాన రహదారిపై స్వాగత వేదికను ఏర్పాటు చేసి వినాయక నిమజ్జనానికి తరలివెళ్తున్న విగ్రహాలకు ఘనంగా స్వాగతం పలికారు.గత 11 రోజులుగా పూజలందుకుని నిమజ్జనానికి వెళ్తున్న వినాయక మండప నిర్వాహకులను, భక్తులను స్వాగతించి ఉత్సాహపరచడం ఆనవాయితీగా వస్తుందని సమితి సభ్యులు తెలిపారు. హిందువులంతా ఐక్యమత్యంతో పండుగలను జరుపుకోవాలని కోరారు. అనంతరం పలువురు ప్రముఖులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ బాలకృష్ణ, కో-కన్వీనర్లు సతీష్ రెడ్డి, సాయి గౌడ్, కిషోర్, సందీప్, మహిళా కో-కన్వీనర్ వీణారెడ్డి, స్టేజీ స్పాన్సర్ నందికొండ శ్రీనివాస్, ఫుడ్ స్పాన్సర్ భరత్ బాబు, కో-ఆర్డినేటర్లు అయ్యప్ప, సాగర్, శేషు కుమార్, అక్షిత్, రాజేష్, మహిళా కో-ఆర్డినేటర్లు స్వాతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసీమలు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

## రూ 1.45 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం.. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసాధి

ఏలూరు/ ఆగిరిపల్లి, సెప్టెంబరు 25: ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి --విజయవాడ ప్రధాన రహదారి నుండి గొండపల్లి వరకు 2 కి.మీ. మేర రూ 95 లక్షలతో నిర్మించనున్న ఆర్‌డబి బిటి రహదారి పనులకు, ఆగిరిపల్లి గ్రామంలోని యాదవులు మండపం నుండి మెట్లకోనేరు వరకు రూ 50 లక్షలు యంపి ల్యాండ్స్ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శుక్రవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసాధి పాల్గొని భూమి పూజలుచేసి, శంఖుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామ ప్రజలను పేరుపేరున పలకరించి గ్రామసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు, మహిళలకు మంత్రికి ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసాధి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, దశలు వారీగా మిగిలిన పనులు అన్నియు పూర్తిచేస్తామని అన్నారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గ్రామీణ రోడ్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ బాగుంటేనే ప్రజలు ఆరోగ్యజీవన విధానాలు మెరుగుపడతాయని, డ్రైనేజీ వ్యవస్థకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతులను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా నిలిచిపోయి అశాంతి, కక్షసాధింపులు, అన్ని చోట్ల వేధింపులేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తోందని తెలిపారు.నూజివీడు నియోజకవర్గంలో జరుగుతున్న కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఆశయాలే తమ అభివృద్ధి అజెండా అని,



నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి,సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని, నూజివీడు నియోజకవర్గం అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరని మంత్రి స్పష్టం చేశారు. మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాలు ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27వ తేదీ ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయి



ఏలూరు, సెప్టెంబర్, 25: ఈనెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మె కారణంగా బ్యాంకింగ్ సేవలకు ప్రజలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున ప్రజల సౌకర్యార్థం ఈనెల 27వ తేదీ ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నాల్గవ శనివారం, 27 ఆదివారం బ్యాంకు సెలవులు మరియు ఈనెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మె కారణంగా వరుసగా ఐదు రోజులపాటు బ్యాంకింగ్ సేవలకు ప్రజలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున ప్రజల బ్యాంకింగ్ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ఈనెల 27వ తేదీ ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయని, ప్రజలు తమ బ్యాంకు లావాదేవీలు యధావిధిగా చేసుకోవచ్చన్నారు. ఏటీఎంలు, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.





# పామాయిల్ తోటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**శాస్త్రవేత్త డాక్టర్ అమృత లక్ష్మి**

కామవరపు కోట, సెప్టెంబర్ 25,
పామాయిల్ తోటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట దిగుబడిని పెంచుకోవచ్చని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అమృతలక్ష్మి సూచించారు. కామవరపుకోట శివారు పాతూరు పాల కేంద్రం వద్ద పామాయిల్ రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత లక్ష్మి మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో వ్యాప్తి చెందుతున్న గానోడెర్మా వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పామాయిల్ తోటల్లో చనిపోయిన మొక్కలను వెంటనే తొలగించాలనీ, తొలగించిన మొక్కలపై బ్లీచింగ్ పౌడర్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. చెట్లపై మందంగా ఉండే పుట్టగొడుగులు వంటి వాటిని వస్తే వాటిని తీసి వేసి శిలీంద్రనాచినీ పేస్ట్ గా చేసి పూత పెట్టాలన్నారు. పామాయిల్ తోటల్లో కింది ఆకులు పసుపు రంగుగా మారటం, క్రింది ఆకులు వేలాడటం వంటివి గమనించినప్పుడు వెంటనే ఐదు కేజీల ట్రైకోడెర్మాను చెట్టుకు వేయాలన్నారు. తోట ఆరోగ్యంగా కనిపించినప్పటికీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ట్రైకోడెర్మా,

బేసిల్లాస్, అజితోబాక్టర్ వంటి జీవన ఎరువులను వేప పిండిలో కలిపి వేయాలన్నారు. జీవన ఎరువులను వాడినప్పుడు నెల రోజుల తర్వాత మాత్రమే శిలీంద్రనాసిని ని వాడాలన్నారు. అనంతరం అంకాలంపాడు జలపువారిగూడెం పాతూరు గ్రామాలలో తుఫాను కారణంగా నేల వాలిన పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎంఐఓ ఎస్ రామ్మోహన్రావు, డి హెచ్ ఓ షాజా నాయక్, ఏ డి హెచ్ సంతోష్, గోద్రెజ్ మేనేజర్ ఏ ఎస్ కే రాజు, మండల వ్యవసాయాధికారి ముత్యాలరావు, ఇంచార్జ్ ఎం హెచ్ ఓ ఎం రత్నమాల, రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు



## ఆర్నాబ్ తుఫానులో ఉత్తరాంధ్ర అధికారుల సేవలు భేష్

**తుఫాను నేపథ్యంలో నష్టం వాటిల్లకుండా చర్యలు**

**జిల్లా, మండల స్థాయి అధికారులు పనితీరు అద్భుతం**

**కూటమి పార్టీ నాయకులు, మీడియా పాత్ర కూడా కీలకం**

**పరిశీలనకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి: కొండపల్లి**

విజయనగరం, సెప్టెంబర్ 25: ఆర్నాబ్ తుఫాను నేపథ్యంలో అకాల వర్షాలకు నష్టం వాటిల్లకుండా విధులు నిర్వహించిన ఉత్తరాంధ్ర అధికారుల సేవలు భేష్ అని శుక్రవారం ఒక పత్రిక ప్రకటనలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా రాష్ట్రంలోనే అధిక వర్షపాతం నమోదవడంతోపాటు భారీ ఈదురు గాలులు వీస్తున్న సందర్భంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసిన కారణంగానే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సూచనలను పాటిస్తూ తుఫాను ప్రభావాన్ని ప్రజలకు నష్టం జరగకుండా ఉండేలా ఉత్తరాంధ్ర జిల్లాలలోని కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీవోలు, డి ఎం ఎం హెచ్ ఓ లు, కమిషనర్లు ఆధ్వర్యంలో కిందిస్థాయి ఉద్యోగులను సమన్వయం చేయటంలో సఫలీకృతులయ్యారన్నారు. కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి తుఫాను పట్ల అప్రమత్తం చేయడంతోనే మానవ, పశు ప్రాణ నష్టం జరగకుండా చేయగలిగామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో తుఫాను కారణంగా సంభవించే నష్టాలను, ప్రమాదాన్ని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేయడంలో కూటమి పార్టీ నాయకుల పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రమాద హెచ్చరికలు జారీచేసి, జరగబోయే పరిణామాలను విస్తృతంగా తెలియచేసి, చైతన్యపరచటంలో మీడియా ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని కొండలు వాగులు, గడ్డలు ఎక్కువ ఉంటాయన్న విషయం మన ప్రాంత అధికారులకు, ప్రజలకు తెలిసిన విషయమేనని

తుఫాను ప్రభావం తగ్గిననూ, ఎగువ కొండ ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు ఇంకా వస్తూనే ఉంది కాబట్టి మరో రెండు రోజులపాటు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే తుఫాను నష్ట నివారణ కోసం వరద ముంపు ప్రాంతాలకు పరిశీలనకు వెళుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది జాగ్రత్త చర్యలు పాటించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

# ఆర్నాబ్ తుఫాను మిగిల్చిన నష్టం

**పలు వీధులు, ప్రధాన రోడ్లు వరదమయం**

**నేలకొరిగిన అరటి, పామాయిల్**

**పలు గ్రామాలలో విద్యుత్ స్తంభాలు నేలమయం**



కామవరపుకోట, సెప్టెంబర్ 25,
ఆర్నాబ్ తుఫాను కామవరపుకోట మండలంలో నష్టాలను మిగిల్చింది. తుఫాను ప్రారంభంలో మెట్ట ప్రాంతమైన కామవరపుకోట మండలంలో అంతగా ప్రభావం చూపించలేదు. గురువారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షం రాత్రి వేసిన భారీవీదురుగాలులకు మెట్ట ప్రాంత రైతన్నలు నష్టాలను చూడాల్సి వచ్చింది. మండలంలో అంకాలంపాడు, జలపవారిగూడెం, పాతూరు ప్రాంతాలలో పలువురు రైతులకు చెందిన పామాయిల్ అరటి తోటలు నేలకు ఒరిగాయి. అలాగే మంకినపల్లి, కంఠమనేని వారి గూడెం, గోటేరు, అంకాలంపాడు ప్రాంతాలలో పలు విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు నేలమయం అయ్యాయి. అలాగే మండల కేంద్రమైన కామవరపుకోటలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కొత్తూరు చెక్పోస్ట్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం, సూర్య నిలయం, దుర్గా మహల్, సౌత్ నా సెంటర్ ప్రధాన వీధుల గుండా వరద ఏరులై ప్రవహించింది. వరద కారణంగా వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే వీరభద్ర కాలనీ, కొమ్ముగూడెం గ్రామాలలో వరద నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లల్లోకి వరదనీరు చేరుకుంది. గంటల తరబడి వరద నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకపోవడంతో నీటి ప్రభావంతో గోడలు నాని కూలిపోతాయని ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వతమైన పరిష్కారం చూపించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా సిపిఐ పార్టీ నాయకులు టీవీఎస్ రాజు వరద ప్రవాహ ప్రాంతాలను, పంట నష్టపోయిన పొలాలను పరిశీలన చేసినట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని తక్షణమే అందజేసి రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# వరద ముంపు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష



ఏలూరు, సెప్టెంబర్, 25 : భారీవర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో భారీవర్షాలు, వరదల పరిస్థితిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తొలగాయన్నారు. వర్షాలకు ముందు 46 శాతం వర్షాభావ పరిస్థితులు ఉండగా, వర్షాలు అనంతరం మైనస్ 23 శాతానికి తగ్గిందన్నారు. వాగులు, కాలువలు, కాజ్ వేలు దాటకుండా బారికేడ్లు, ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు చేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ముఖ్యంగా వృద్దులు, చిన్న పిల్లలు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రులలో అన్ని మందుల నిల్వలు ఉంచుకోవాలన్నారు. వర్షాల అనంతరం పూర్తిగా పారిశుధ్య పనులు చేపట్టాలని, విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరంలో డ్రైన్లలో చెత్త తొలగించని కారణంగా నగరంలోని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, 48 గంటలలోగా పారిశుధ్య సిబ్బంది అందరు సేవలు వినియోగించుకుని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ఎక్కడా చెత్త, మురుగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, మంచినీటి వనరులలో క్లోరినేషన్, పట్టణంలో బ్లీచింగ్ చల్లించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాల వీడియోలు పంపించాలని మంత్రి నగరపాలక సంస్థ కమీషనర్ ని ఆదేశించారు. తడిసిన పంటలు కాపాడేందుకు రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు ఇవ్వాలన్నారు. భారీ వర్షాల కారణంగా కూలిన చెట్లు, స్తంభాలను యుద్ధప్రాతిపదికన తొలగించి రవాణా, విద్యుత్ సౌకర్యాలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. వర్షాల కారణంగా జిల్లాలో ఎల్నినో ప్రభావం తగ్గిందని , భూగర్భ జలాలు పెరిగాయని, కాలువలు, చెరువులు, జలాశయాలు నీటితో నిండాయన్నారు. ఇరిగేషన్, మంచినీటి చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలో జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా ఇరిగేషన్ కాలువలు, చెరువులు, రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం పెంపుదలకు చర్యలు చేపట్టామని, ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా ఆయా చెరువులు, కాలువలలో 70 నుండి 100 శాతం వరకు నీరు నిల్వ చేసుకోగలుతున్నామన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, డ్వామా పిడి కె.వి. సుబ్బారావు, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్,, ఇరిగేషన్, ట్రాన్స్కో, పంచాయతీరాజ్ ఎస్ఈలు జి. గోపాల్, కె. ఎం. అంబేద్కర్ , జెడ్. రమేష్, భూగర్భ జలశాఖ డిడి కోదండరాం, డిఎంహెచ్ఓ డా. యు. శోభ, డిసిహెచ్ఎస్ డా. బేబీ కమల, ప్రభృతులు పాల్గొన్నారు.




# ఢిల్లీ స్థాయి జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026

### కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ: సెప్టెంబర్ 25, 2026: విజయవాడ నగరంలో తొలిసారిగా ఢిల్లీ స్థాయిలో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 08 నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లో సుమారు 600 స్టాల్లతో ఈ మేళాను నిర్వహించనున్నారు. మేళా నిర్వహణకు ఎంపిక చేసిన పున్నమి ఘాట్ ప్రాంతాన్ని శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, స్టాల్ల ఏర్పాటు, భద్రత, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సందర్శకుల సౌకర్యాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మేళా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, ఎన్ఆర్ఎల్ఎం జాయింట్ సెక్రటరీ స్వాతి శర్మ, డైరెక్టర్ మౌలిశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి విక్రయించుకునే మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. గత ఏడాది గుంటూరులో సుమారు 300 స్టాల్లతో నిర్వహించిన సరస్ మేళాలో సుమారు రూ.30 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు తెలిపారు. ఈసారి విజయవాడలో 600 స్టాల్లతో మరింత భారీ స్థాయిలో మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 2,500 మంది మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ రాష్ట్రాలకు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, సహజ ఉత్పత్తులు, గ్రామీణ కళాకృతులను ప్రదర్శించి విక్రయించనున్నట్లు తెలిపారు.

### మహిళా సాధికారతకు సరస్ మేళా గొప్ప అవకాశం: కొండపల్లి శ్రీనివాస్‌లి

రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు జాతీయ సారస్ ఆజీవిక మేళా గొప్ప అవకాశంగా నిలుస్తుందని అన్నారు. సాధారణంగా ఢిల్లీలో నిర్వహించే స్థాయి సారస్ మేళాను ఈ ఏడాది విజయవాడలో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్, విక్రయ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల సమయంలో మేళా నిర్వహించడం వల్ల విజయవాడలో ఉత్సవ వాతావరణం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేస్తున్న నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను ప్రకటించి ముందుకు తీసుకెళ్లనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత 35 సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ, స్వయం ఉపాధి, మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి తదితర అంశాల్లో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు.





# నగరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలన

వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి గురువారం రాత్రి విజయవాడ అర్బన్ పరిధిలోని మధ్యకట్టతో పాటు కస్తూరిబాయిపేటలో పర్యటించి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కస్తూరిబాయిపేటలో కొండచరియలు ఒక ఇంటిపై పడిన విషయం గుర్తించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను తక్షణమే సురక్షిత పునరావాస కేంద్రానికి తరలించారు. నగరంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా గుర్తించి వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సిన ఆవశ్యకతపై మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా తరచూ అవగాహన కల్పించాలని సూచించారు. పర్యటనలో భాగంగా ఓ హోటల్‌ను సందర్శించి ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార తయారీలో పాటిస్తున్న పారిశుధ్య ప్రమాణాలు, తాగునీటి పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆహారం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా నిర్వాహకులు తప్పనిసరిగా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు.




# విజయవాడలో తొలిసారి జాతీయస్థాయి డ్వాక్రా రుణమేళా

### అక్టోబర్ 8 నుండి 22 వరకు

విజయవాడ, సెప్టెంబర్ 25: విజయవాడ నగరంలో అక్టోబర్ 8 నుంచి 22 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి 'సరస్' (రూూాూ=ూూూ) ప్రదర్శన మరియు విక్రయ మేళా ఏర్పాట్లపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రదర్శన మరియు విక్రయశాలను ప్రజలంతా వినియోగించుకోవాలని కేంద్ర రాష్ట్ర మంత్రులు సూచించారు. విజయవాడలో దసరా సందర్భంగా జరిగే అతిపెద్ద ఈ డ్వాక్రా రుణమేళాలో 25 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుండి 300 పైగా స్టాల్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా రుణమేలకు వచ్చే స్పందనను బట్టి గడువు పొడగింపు అంశాన్ని పరిశీలిస్తామని మంత్రులు వెల్లడించారు. జిల్లా స్థాయి అధికారులతో కలిసి సరస్ నిర్వహించే పున్నమి ఘాట్‌ను పరిశీలించారు. అనంతరం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రాథమిక సమీక్షా సమావేశంలో ప్రదర్శన గురించే అనేక అంశాలను చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ సౌమ్య స్వాతి శర్మ , సెర్ప్ సెక్రటరీ శ్రీమతి వాకాటి కరుణ , ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ , విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర్ బాబు, విజయవాడ నగరపాలక సంస్థ (ఎవీజ) కమిషనర్ హెచ్. ఎం. ధ్యానచంద్ర మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పేదలకు పట్టాభిషేకాన్ని సద్వినియోగం చేసుకోండి

### అర్హులు స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోండి

### తహశీల్దార్ కార్యాలయాల్లోనూ పేర్ల నమోదుకు వీలు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జిల్లాలో గతంలో ప్రభుత్వం మంజూరుచేసిన నివేశన స్థల పట్టాలకు అమ్మకపు హక్కుతో కూడిన రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో గృహ నిర్మాణం చేసుకొని నివసిస్తున్న అర్హులైన ఆక్రమణదారుల ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. అర్హులైన వారు తమ సమీప స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలను లేదా సంబంధిత తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి వారిచే ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో అర్హులైన వారందరూ భాగస్వాములు కావాలని.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం, ఇతర ప్రయోజనాలు పొందాల్సిందిగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు.





# ఆలోచనలకు రెక్కలు.. ప్రతిభకు అవకాశాలు

**సృజనాత్మక ఆర్థిక రంగంలో విస్తృత అవకాశాలు**

**డిజిటల్ సాంకేతికత, ఏఐతో ప్రతిభకు పట్టం**

**అమరావతిలో క్రియేటివ్ ఇండస్ట్రీకి కొత్త ఊపు**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి**

సృజనాత్మకత, ప్రతిభ, సాంకేతికత కలయికతో యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. సృజనాత్మక ఆర్థిక రంగం (క్రియేటివ్ ఎకానమీ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కళలు, డిజైన్, చలనచిత్రం, సంగీతం, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, ప్రకటనలు, ఫ్యాషన్ తదితర రంగాల్లో ప్రతిభావంతులకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

శుక్రవారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్ ఆర్క్ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి క్రియేటివ్ ఎకానమీపై వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ ను ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి ఉదయం ప్రారంభించగా.. సాయంత్రం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి దాదాపు 300 మంది యువతీయువకులు హాజరయ్యారు. మంత్రివర్యులు కందుల దుర్గేష్ సహాయ సహకారాలతో జరిగిన కార్యక్రమంలో కథా రచన, దర్శకత్వం, నిర్మాణం, ఎడిటింగ్, దృశ్య వీఎఫ్ఎక్స్, యానిమేషన్ వంటి విభాగాలపై అవగాహన కల్పించారు. స్థానికంగానే సృజనాత్మక యువతకు మంచి అవకాశాలు లభించేలా జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్ ఆర్క్ బృంద సభ్యులు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ప్రతిభావంతులైన సినీ దర్శకులు, కంటెంట్ సృష్టికర్తలు, యానిమేటర్లు, వీఎఫ్ఎక్స్ కళాకారులు, కథకులు, సృజనాత్మక ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ కార్యక్రమాన్ని చూడటం ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. అమరావతిలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, సృజనాత్మక రంగంలోని ప్రతిభావంతులకు కొత్త అవకాశాలను కల్పించే ఈ ముఖ్యమైన కార్యక్రమంలో భాగస్వామిగా ఉండటం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికతతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) అందుబాటులోకి రావడంతో సృజనాత్మక రంగంలో పనిచేసే వారికి కొత్త మార్గాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. యువత తమలోని సృజనాత్మకతను సాంకేతిక నైపుణ్యాలతో అనుసంధానం చేసుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆలోచనలను ఉత్పత్తులు, సేవలు, వ్యాపార అవకాశాలుగా మలుచుకునేలా అవసరమైన నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం ద్వారా యువతకు మరింత చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సృజనాత్మక పరిశ్రమలకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సాంకేతికత, మౌలిక వసతులు, యువ ప్రతిభ, పెట్టుబడులు ఒకే వేదికపైకి వస్తే క్రియేటివ్ ఇండస్ట్రీ మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. స్థానిక ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు సృజనాత్మక రంగం కీలకంగా నిలుస్తుందని.. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఆరెంజ్ ఎకానమీ విస్తరణతో సరికొత్త అవకాశాలు అందిపుచ్చుకునేలా చూస్తోందన్నారు. కార్యక్రమంలో జాడెక్స్ ఇన్నోవిజన్ బృంద సభ్యులు దివ్య కొనకళ్ల, రాఘవ చైతన్య, పి.శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హీరో మోటార్స్ షేరుకు జోష్

**ముంబై, సెప్టెంబరు 25 :**

స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన మూడు రోజుల్లోనే హీరో మోటార్స్ షేరు భారీ లాభాలను నమోదు చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఈ షేరు వరుసగా రెండో రోజు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ.141.85 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,443.05 కోట్లకు చేరింది. లిస్టింగ్ తర్వాత వరుసగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో షేరు ధర వేగంగా పెరిగింది. హీరో మోటార్స్ షేర్లు సెప్టెంబరు 23న స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. కంపెనీ ఐపీఓ ఇష్యూ ధరను రూ.84గా నిర్ణయించింది. అయితే లిస్టింగ్ సమయంలో ఎన్ఎస్ఈలో రూ.82 వద్ద, బీఎస్ఈలో రూ.82.10 వద్ద షేర్లు నమోదయ్యాయి. దీంతో ఇష్యూ ధరతో పోలిస్తే ఎన్ఎస్ఈలో 2.38 శాతం డిస్కౌంట్‌తో షేరు మార్కెట్లోకి వచ్చింది. లిస్టింగ్ రోజున డిస్కౌంట్ ఎదురైనప్పటికీ.. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. లిస్టింగ్ అనంతరం షేరులో కొనుగోళ్ల మద్దతు క్రమంగా పెరిగింది. దీంతో షేరు ధర వరుస సెషన్లలో గణనీయంగా పెరిగింది. లిస్టింగ్ ధరతో పోలిస్తే ఇప్పటివరకు దాదాపు 73 శాతం వృద్ధి నమోదైంది. శుక్రవారం మరోసారి 20 శాతం అప్పర్ సర్క్యూట్ తాకడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఈ షేరుపై పడింది. బీఎస్ఈలో రూ.141.85 స్థాయికి చేరడం ద్వారా కొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది.ఐపీఓకు మంచి స్పందన హీరో మోటార్స్ ఐపీఓ సెప్టెంబరు 16 నుంచి 18 వరకు కొనసాగింది. ఈ ఐపీఓకు మొత్తం 6.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,000 కోట్లను సమీకరించింది. ఇందులో రూ.600 కోట్ల విలువైన 7.14 కోట్ల తాజా షేర్లను జారీ చేసింది. మరో రూ.400 కోట్ల విలువైన 4.76 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించింది.




కంపెనీ వ్యాపార కార్యకలాపాలను పరిశీలిస్తే.. అమెరికా, యూరప్, భారత్, ఆసియాన్ దేశాల్లోని ఆటోమొబైల్ తయారీ సంస్థలకు అవసరమైన పవర్‌ట్రెయిన్ సొల్యూషన్స్‌ను హీరో మోటార్స్ అందిస్తోంది. వాహనాల ఇంజిన్, డ్రైవ్ వ్యవస్థలకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులను కంపెనీ అందిస్తోంది. పలు అంతర్జాతీయ మార్కెట్లలో ఆటోమొబైల్ పరిశ్రమతో అనుసంధానమై వ్యాపారాన్ని కొనసాగిస్తోంది.ఆర్థిక ఫలితాల్లోనూ వృద్ధి కంపెనీ ఆర్థిక పనితీరులోనూ వృద్ధి నమోదైంది. 2023-24 నుంచి 2025-26 మధ్య కాలంలో సంస్థ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.7 శాతం వృద్ధి చెందింది.



# యూపీఐ ఛార్జీలపై కేంద్రం స్పష్టత..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 :**

యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)కు సంబంధించి వినియోగదారుల్లో నెలకొన్న సందేహాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. కొత్త ఎండీఆర్ విధానం కస్టమర్లపై అదనపు భారాన్ని మోపదని కేంద్రం పేర్కొంది. నిర్దిష్ట పెద్ద మొత్తాల వ్యాపార లావాదేవీలకు మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని, ఈ రుసుము వ్యాపారులు-చెల్లింపుల వ్యవస్థలోని సంబంధిత భాగస్వాముల మధ్యే ఉంటుందని స్పష్టం చేసింది.

### అక్టోబరు 15 నుంచి కొత్త నిబంధనలు

కొత్త విధానం ప్రకారం అక్టోబరు 15, 2026 నుంచి రూ.2,000కు మించిన కొన్ని పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా ఒక్కో లావాదేవీకి రూ.300కు పరిమితం చేశారు. అయితే వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పర్సన్-టు-పర్సన్ (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ ఉండదు.రూ.2,000 వరకు జరిగే వ్యాపారి లావాదేవీలు కూడా ఎండీఆర్ నుంచి మినహాయింపు పొందుతాయి. అలాగే చిన్న వ్యాపారు లకు వర్తిస్తున్న జీరో-ఎండీఆర్ విధానం కొనసాగనుంది. నెలకు యూపీఐ ద్వారా రూ.1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపా రులు, వీధి వ్యాపారులు, స్థానిక దుకాణాలు తదితరులకు కూడా రక్షణ కల్పించినట్లు కేంద్రం తెలిపింది. దీంతో మొత్తం పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో సుమారు 96 శాతం ఎండీఆర్ ప్రభావానికి లోనుకావని ప్రభుత్వం వెల్లడించింది. కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేయ రాదు ఎండీఆర్ అనేది కస్టమర్‌పై విధించే ఛార్జీ కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఉదాహరణకు ఒక వినియోగ దారు వ్యాపారికి రూ.5,000ను యూపీఐ ద్వారా చెల్లించిన పుడు.. ఎండీఆర్ పేరుతో కస్టమర్ నుంచి అదనంగా రుసుము వసూలు చేయడం కొత్త విధానంలో భాగం కాదు. ఎండీఆర్ వ్యాపారి చెల్లింపు వ్యవస్థలోనే వర్తిస్తుంది.

### ఎండీఆర్ అంటే ఏమిటి?

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అనేది వ్యాపారి నుంచి స్వీకరించే డిజిటల్ చెల్లింపును ప్రాసెస్ చేసే సమయంలో చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వాముల మధ్య వర్తించే రుసుము.



**ఎంఎస్ఎంఈల అభివృద్ధికి**

# బ్యాంకుల బాసట

**సులభతర రుణాలతో సమర్థవంతమైన చేయూత**

**రుణ దరఖాస్తుల సత్వర పరిశీలన, పరిష్కారానికి బ్యాంకుల చర్యలు**

**ప్రత్యేక సమన్వయ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ కె.శ్రీధర బాబు**

ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రుణ సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, వారికి అవసరమైన మార్గదర్శకత్వం, చేయూత సేవలను సమర్థవంతంగా అందించేందుకు శుక్రవారం విజయవాడ వన్‌టౌన్‌లోని లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ చేయూత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్, యూబీఐ జనరల్ మేనేజర్ కె.శ్రీధర బాబు, కేవీఐసీ స్టేట్ హెడ్ గ్రీప్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.మధు, వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

సమావేశంలో ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, రుణ ప్రతిపాదనల సత్వర పరిశీలన, పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం అంశాలపై చర్చించారు. అర్హత కలిగి, ఆచరణ సాధ్యమైన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు నిబంధనలకు అనుగుణంగా, తగిన మూల్యాంకనం అనంతరం ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామికవేత్తలు తాము ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాజెక్టు వ్యయం, మార్కెట్ అవకాశాలు, నిర్వహణ అవసరాలు, అంచనా ఆదాయం, వ్యయాలు, రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహనతో ప్రతిపాదనలు సమర్పిస్తే రుణాల పరిశీలన, మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. వ్యాపారం కోసం పొందిన రుణ మొత్తాన్ని, వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్దేశిత వ్యాపార అవసరాలకే వినియోగిస్తూ, సంస్థ కార్యకలాపాలను సజావుగా నిర్వహించి, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తి అర్హత కలిగిన రుణ దరఖాస్తులను బ్యాంకులు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డాక్యుమెంటేషన్, పథకాల అర్హత, ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు ప్రతిపాదనల రూపకల్పన తదితర అంశాల్లో పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ అధికారులు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని నిర్ణయించారు. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈ రుణ ప్రతిపాదనల పరిష్కారానికి బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ, ఇతర సంబంధిత శాఖల మధ్య నిరంతర సమన్వయం కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఏజీఎం (ఎంఎల్‌పీ) వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ హెడ్ రహీమ్, ఏజీఎం శ్యామ్, ఎన్టీఆర్ జిల్లా ఎల్‌డీఎం వెంకట సుబ్బయ్యతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



# మన్‌ప్రీత్ కౌర్‌కు షాట్‌పుట్‌లో కాంస్యం

**నాగోయా, సెప్టెంబరు 25 :**
ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ మన్‌ప్రీత్ కౌర్ సత్తా చాటింది. మహిళల షాట్‌పుట్ ఫైనల్లో 17.17 మీటర్ల దూరం ఇనుప గుండును విసిరి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల పతకం సాధించిన మూడో భారత మహిళగా మన్‌ప్రీత్ చరిత్ర సృష్టించింది.

## 17.17 మీటర్లతో పోడియంపై

శుక్రవారం జరిగిన మహిళల షాట్‌పుట్ ఫైనల్లో మన్‌ప్రీత్ ఆరంభం నుంచే నిలకడగా ప్రదర్శన ఇచ్చింది. కీలక ప్రయత్నంలో 17.17 మీటర్ల దూరం విసరడంతో మూడో స్థానంలో నిలిచి కాంస్యాన్ని ఖాయం చేసుకుంది. అంతకుముందు బర్బరా వెబ్‌స్టర్ 1951లో, కిరణ్ బలియాన్ 2023లో ఈ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. తాజాగా వారి సరసన మన్‌ప్రీత్ చేరింది.




# సాత్విక్-చిరాగ్‌కు షాక్.. మానుష్-దియా పతకం ఖాయం

**నాగోయా, సెప్టెంబరు 25 :**
ఆసియా క్రీడల్లో ఆరో రోజు భారత బృందానికి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా నిష్క్రమించారు. మరోవైపు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మానుష్ షా-దియా చిటాలే జోడీ సెమీఫైనల్‌కు చేరి భారత్‌కు పతకం ఖాయం చేసింది.

## తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఔట్

పురుషుల డబుల్స్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్-చిరాగ్ జోడీ థాయ్‌లాండ్‌కు చెందిన పక్కపోన్ తీరరత్సకుల్-పీరట్చాయ్ సుఖ్‌ఫున్ జంటతో తలపడింది. తొలి గేమ్‌ను 21-12తో గెలిచిన భారత జోడీ ఆ తర్వాత తడబడింది. థాయ్ జంట 21-19, 21-14తో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో గత ఆసియా క్రీడల్లో సాధించిన స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలన్న సాత్విక్-చిరాగ్ ప్రయత్నం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

## మానుష్-దియాకు పతకం ఖాయం

టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మానుష్ షా-దియా చిటాలే అద్భుత ప్రదర్శన చేశారు. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంక్ హాంకాంగ్ జోడీ వాంగ్ చున్ టింగ్-దూ హోయ్ కెమ్‌ను 3-1తో ఓడించి సెమీఫైనల్‌కు చేరారు. 11-6, 13-15, 11-9, 11-5తో విజయం సాధించిన భారత జోడీకి కనీసం కాంస్య పతకం ఖాయమైంది.

సెమీఫైనల్లో మానుష్-దియా చిటాలే జోడీ చైనాకు చెందిన వాంగ్ చుకిన్-సున్ యింగ్‌షా జంటతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత జోడీ ఫైనల్‌కు చేరి రజతం ఖాయం చేసుకుంటుంది. ఓటమి ఎదురైనా కాంస్య పతకం భారత్ ఖాతాలో చేరుతుంది.

## ప్రీతి పవార్‌పై ఉత్కంఠ

మహిళల 54 కిలోల బాక్సింగ్ విభాగంలో ప్రీతి పవార్ నార్త్ కొరియాకు చెందిన పాంగ్ చోయ్ మితో రౌండ్ ఆఫ్ 16లో తలపడాల్సి ఉంది. గతంలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన ప్రీతి ఈ పోటీలో పతకంపై ఆశలు పెంచుకుంది.

# ఆఫ్ఘన్‌కు నేపాల్ షాక్







**ముంబై, సెప్టెంబరు 25 :**
ఆసియా క్రీడల క్రికెట్‌లో నేపాల్ సంచలనం సృష్టించింది. గ్రూప్-ఏలో భాగంగా కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో పటిష్ఠమైన ఆఫ్ఘనిస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించింది. ముందుగా బౌలింగ్‌లో అదరగొట్టిన నేపాల్.. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని ఛేదించి టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసింది.

## 102 పరుగులకే ఆఫ్ఘన్ ఆలౌట్

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్‌ను నేపాల్ స్పిన్నర్లు కుశాల్ భుర్టెల్, లలిత్ రాజ్‌బంశీ వణికించారు. భుర్టెల్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. రాజ్‌బంశీ కేవలం 13 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. దీంతో ఆఫ్ఘన్ బ్యాటర్లు పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఫైసల్ షినోజాదా, నజీబుల్లా జద్రాన్ చెరో 30 పరుగులు చేయడంతో ఆఫ్ఘనిస్థాన్ 20 ఓవర్లలో 102 పరుగులకు కుప్పకూలింది.

## జోరా-పౌడెల్ ఆదుకున్నారు

103 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు కుశాల్ భుర్టెల్ (0), ఆసిఫ్ షేక్ (2) త్వరగా ఔటవ్వగా.. కుశాల్ మల్లా రనౌట్ కావడంతో 6.3 ఓవర్లలో 31 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సుందీప్ జోరా (34), రోహిత్ పౌడెల్ (33 నాటౌట్) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. సుందీప్ జోరా రనౌట్ అయిన తర్వాత కూడా పౌడెల్ కెప్టెన్ దీపేంద్ర సింగ్ ఐరీ (15)తో కలిసి జట్టును విజయానికి చేరువ చేశాడు. 16, 17వ ఓవర్లలో మూడు ఫోర్లు బాదిన పౌడెల్ ఒత్తిడిని తగ్గించాడు. దీపేంద్ర ఔటైన అనంతరం గుల్షన్ ఝుఅ సింగిల్‌తో నేపాల్ విజయాన్ని పూర్తి చేసింది. ఈ గెలుపుతో నేపాల్ ఖాతా తెరిచింది. ఆఫ్ఘనిస్థాన్ రెండు మ్యాచ్‌ల్లో ఒక విజయం, ఒక ఓటమితో మెరుగైన నెట్ రన్‌రేట్ ఆధారంగా గ్రూప్‌లో ముందంజలో ఉంది.

# ఆస్ట్రేలియా-ఏపై భారత్-ఏ ఘన విజయం




**పుదుచ్చేరి, సెప్టెంబరు 25 :**
ఆస్ట్రేలియా-ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు 162 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పుదుచ్చేరి సీఏపీ-సీచెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు 55 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ.. 200 పరుగులకే ఆలౌటైంది.

## ములానీ, దేశ్‌పాండే విజృంభణ

భారత్-ఏ బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ షామ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో అతడు మొత్తంగా ఏడు వికెట్లు సాధించాడు. మరోవైపు మీడియం పేసర్ అన్షుల్ కాంబోజ్ తొలి సెషన్‌లో రెండు వికెట్లు తీశాడు. నాథన్ మెక్‌స్వీనీ, పీటర్ హ్యాండ్స్‌కోంబ్‌ను పెవిలియన్‌కు పంపాడు. దేశ్‌పాండే మూడు వికెట్లు, కోటియన్ రెండు వికెట్లు పడగొట్టారు.

## 162 పరుగుల తేడాతో విజయం

భోజన విరామ సమయానికి ఆస్ట్రేలియా-ఏ 185 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత మిగిలిన మూడు వికెట్లను భార త్-ఏ బౌలర్లు త్వరగానే పడ గొట్టడంతో ఆసీస్ ఇన్నింగ్స్ 200 పరుగుల వద్ద ముగి సింది. భార త్-ఏ తరఫున కుమార కుషాగ్రా కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభిం చింది. స్కోరు: భారత్-ఏ 334, 199బీ ఆస్ట్రేలి యా-ఏ 171, 200. ఆస్ట్రేలి యా-ఏ తరఫున ఓ'నీల్ 47 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్ సెప్టెం బరు 29 నుంచి అక్టోబరు 2 వరకు జరగనుంది. అనంత రం ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు నిర్వహించనున్నారు.

# 24 ఏళ్లుగా అందని సిరీస్‌పై విండీస్ కన్ను



**తిరువనంతపురం, సెప్టెంబరు 25 :**
స్వదేశంలో టీమిండియాను ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. ఇటీవల కొన్ని సిరీస్‌ల్లో భారత్‌కు ఎదురుదెబ్బలు తగిలినా.. సొంతగడ్డపై ఆ జట్టు బలమైన ప్రదర్శన చేస్తోంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా వెస్టిండీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. తొలి వన్డే సెప్టెంబరు 27న తిరువనంతపురంలో జరగనుంది.

## 24 ఏళ్లుగా ఎదురుచూపులు

భారత్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో వెస్టిండీస్ చివరిసారిగా 2002లో విజయం సాధించింది. ఆ తర్వాత ఇప్పటివరకు భారత్ గడ్డపై ఒక్క వన్డే సిరీస్‌ను కూడా కరీబియన్ జట్టు గెలవలేకపోయింది. దీంతో ఈసారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో షాయ్ హోప్ బృందం బరిలోకి దిగుతోంది.

## చరిత్ర మార్చేందుకు సిద్ధం

తొలి వన్డేకు ముందు వెస్టిండీస్ కోచ్ డారెన్ సమీ మాట్లాడుతూ భారత్‌పై సిరీస్ విజయం తమకు పెద్ద సవాలని పేర్కొన్నాడు. 24 ఏళ్లుగా అందని విజయాన్ని సాధించేందుకు ఈ పర్యటన తమకు మంచి అవకాశమని, వన్డేల్లో తమ స్థాయిని పరీక్షించుకునేందుకు సిరీస్ ఉపయోగపడుతుందని తెలిపాడు. భారత్‌పై మెరుగైన ప్రదర్శన చేసి సిరీస్‌ను గెలుచుకోవడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

## భారత్‌కు స్టార్ బలం

మరోవైపు టీమిండియా కూడా పూర్తి స్థాయి సన్నాహాలతో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ శుభ&మన్ గిల్‌తో పాటు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇప్పటికే సాధనలో నిమగ్నమయ్యారు. భారత్-వెస్టిండీస్ మధ్య మూడు వన్డేలు సెప్టెంబరు 27, 30, అక్టోబరు 3 తేదీల్లో తిరువనంతపురం, గువాహటి, న్యూ చండీగఢ్‌లో జరగనున్నాయి.



# జోష్నాకు ఆరో పతకం

**నగోయా, సెప్టెంబరు 25 :**
భారత స్క్వాష్ స్టార్ జోష్నా చినప్ప అరుదైన ఘనత సాధించారు. వరుసగా ఏడోసారి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటున్న 40 ఏళ్ల జోష్నా.. ఈసారి మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. వెలవన్ సెంథిల్ కుమార్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరడం ద్వారా ఆమె కెరీర్‌లో ఆరో ఏషియన్ గేమ్స్ పతకం ఖాయమైంది. దీంతో వరుసగా ఏడు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా ఇప్పటికే రికార్డు సృష్టించిన జోష్నా.. ఇప్పుడు తన పతకాల సంఖ్యను ఆరుకు పెంచుకోనున్నారు.

## ఫిలిప్పీన్స్ జోడీపై విజయం

మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో జోష్నా-వెలవన్ జోడీ ఫిలిప్పీన్స్‌కు చెందిన డేవిడ్ పెలినో-జెమికా అరిబాడో జోడీతో తలపడింది. భారత జోడీ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కేవలం అరగంటలోపే మ్యాచ్‌ను ముగిస్తూ 11-3, 11-5తో వరుస గేముల్లో విజయం సాధించింది. తొలి గేమ్‌ను తొమ్మిది నిమిషాల్లో, రెండో గేమ్‌ను పది నిమిషాల్లో గెలిచిన భారత జోడీ.. సెమీఫైనల్ బెర్త్‌తో పాటు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది.

జోష్నా అనుభవం, వెలవన్ సెంథిల్‌కుమార్ దూకుడు భారత జోడీ విజయానికి కీలకంగా నిలిచాయి. ప్రత్యర్థులు పుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. భారత ఆటగాళ్లు ఆధిపత్యాన్ని కొనసాగించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి పాయింట్ వరకు వ్యూహాన్ని సమర్థంగా అమలు చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు.

## 2002లో మొదలైన ప్రయాణం

జోష్నా చినప్పకు ఇది ఏడో వరుస ఏషియన్ గేమ్స్. 2002 బుసాన్ ఏషియన్ గేమ్స్‌లో ప్రారంభమైన ఆమె ప్రయాణం 2026 ఐచి-నగోయా క్రీడల వరకు కొనసాగింది. ఇప్పటివరకు ఆమె రెండు రజతాలు, మూడు కాంస్యాలు సాధించారు.



# వయసుపై వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్



**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య తన వయసుపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పెట్టారు. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి 'అల వైకుంఠపురములో', 'రంగ్ దే', 'టక్ జగదీష్', 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో సహాయక పాత్రల్లో నటించారు. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన వైష్ణవి.. ఆ చిత్రంతో ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'లవ్ మీ', 'జాక్' చిత్రాల్లో కథానాయికగా నటించారు. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్' సినిమాలో కనిపించారు. సెప్టెంబరు 11న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వైష్ణవిని యాంకర్ ఆమె వయసుపై ప్రశ్నించారు. వికీపీడియాలో తన వయసు 32 ఏళ్లుగా ఉందని, అయినప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తున్నారని.. అందుకు కారణం ఏమిటని అడిగారు.

# కొత్త సినిమా కోసం రిషబ్ శెట్టి ఓపెన్ కాస్టింగ్ కాల్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి కొత్త సినిమా కోసం ఓపెన్ కాస్టింగ్ కాల్ ప్రకటించారు. తన నిర్మాణ సంస్థ రిషబ్ శెట్టి ఫిల్మ్స్ ఆధ్వర్యంలో తెరకెక్కనున్న కొత్త ప్రాజెక్ట్‌లో నటించేందుకు కొత్త ప్రతిభను ఎంపిక చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆడిషన్లు అక్టోబరు 2న బెంగ ళూరులోని విజయా కాలేజీలో నిర్వహించనున్నారు. పురుషు లకు 20 నుంచి 65 ఏళ్లు మహిళలకు 20 నుంచి 60 ఏళ్ల వయోపరిమితిని నిర్ణయించారు. నటనపై ఆసక్తి ఉన్నవారు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని చిత్రబృం దం సూచిం చింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ జీవిత విశేషాలు, వ్యక్తిగత వివరాలు, గతంలో చేసిన పనులకు సంబం ధించిన వివరాలు లేదా లింకులను ు పంపవచ్చు. విభిన్న పాత్రలకు సరిపోయే కొత్త ముఖాలను ఎంపిక చేయను న్నట్లు రిషబ్ శెట్టి తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించారు. సినిమా రంగం లోకి అడుగుపెట్టాలని కలలు కంటున్న కొత్త నటీనటులకు ఈ ఆడిషన్స్ మంచి వేదికగా మార నున్నాయి. అర్హతలు, ఎంపిక ప్రక్రియ, ఇతర వివరాల కోసం రిషబ్ శెట్టి అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో వచ్చే సమాచారాన్ని గమనిం చాలని నిర్వాహ కులు సూచించారు.

# 'రంభ ఊర్వశి మేనక' ఓటీటీలోకి వచ్చేసింది

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

కామెడీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే అల్లరి నరేష్ మరోసారి వినోదాత్మక కథతో వచ్చిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహించిన ఈ సినిమాను రాజేష్ దండా, ప్రసాద్ నిమ్మకాయల సంయుక్తంగా నిర్మించారు. సెప్టెంబరు 4న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల తర్వాత 'రంభ ఊర్వశి మేనక' అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ ప్రారంభించింది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ సినిమాను వీక్షించే అవకాశం కల్పించారు. దీంతో థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి నుంచే చూసే అవకాశం లభించింది. సామాజిక అంశాలను ఫాంటసీ అంశాలతో మేళవిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. అల్లరి నరేష్ కామెడీ టైమింగ్‌తో పాటు విభిన్నమైన కథలను ఎంచుకునే నటుడిగా గుర్తింపు తెచ్చుకు న్నారు. ఈ సినిమాలోనూ వినోదంతో పాటు ఫాంటసీ అంశాలను జోడించి ప్రేక్షకు లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే థియేట ర్లలో విడుదలైన సమయం లో సినిమాకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. కథనం, ఫాంటసీ అంశాలు ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకున్నాయన్న దానిపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఇప్పుడు ఓటీటీలో అందుబాటులోకి రావ డంతో ఈ సినిమాకు కొత్త ప్రేక్షకుల నుంచి ఎలాంటి ఆదరణ లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో అల్లరి నరేష్‌తో పాటు రాశి సింగ్, ప్రిషా సింగ్, విష్ణుప్రియ, సురభి, వీకే నరేష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఫాంటసీ, వినోదం, సామాజిక అంశాలను మేళవించిన ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.






# 'సిగ్మా'లో మంచి ఎమోషనల్ క్యారెక్టర్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

సందీప్ కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫరియా మీడియాతో మాట్లాడారు. 'సిగ్మా'లో తాను రేడియో జాకీ పాత్రలో కనిపిస్తానని ఫరియా తెలిపారు. తన పాత్రలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించే అవకాశం లభించిందని చెప్పారు. యాక్షన్, అడ్వెంచర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి హాయిగా చూడొచ్చని పేర్కొన్నారు.సందీప్ కిషన్‌తో కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నామని,చివరకు 'సిగ్మా'తో ఆ అవకాశం వచ్చిందని ఫరియా వెల్లడించారు. దర్శకుడు జేసన్ సంజయ్ జూమ్ కాల్‌లో కథ చెప్పారని, కథ విన్న తర్వాత ఆయన వయసు అడిగితే 24 ఏళ్లని చెప్పారని గుర్తుచేసుకున్నారు.

తొలి సినిమా అయినప్పటికీ జేసన్ ఎంతో స్పష్టత, విజన్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని ఫరియా ప్రశంసించారు. సూపర్‌స్టార్ విజయ్ కుమారుడనే భావన ఆయనలో ఏమాత్రం కనిపించదని, చాలా వినయంగా, స్నేహపూర్వకంగా ఉంటారని అన్నారు. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉ ందని, తమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఫరియా పేర్కొన్నారు.



# మధురైలో ధనుష్ 'డి-56' ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'డి-56' మధురైలో పూజా కార్యక్రమాలతో లాంఛ నంగా ప్రారంభమైంది. 'లబ్బర్ పందు' సినిమాతో గుర్తింపు తెచ్చు కున్న యువ దర్శకుడు తమిళరసన్ పచము త్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తు న్నారు. ఈ సినిమాతో ధనుష్ మరో వైవిధ్యమైన పాత్రలో కనిపించ నున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ధనుష్‌కు జోడీగా ప్రీతి ముకుం దన్ నటించ నున్నారు. లెజెండరీ కమెడియన్ వడివేలు, ఎస్.జె. సూర్య, 'ఉరియడి' ఫేమ్ విజయ్ కుమార్ తదిత రులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భిన్న తరాలకు చెందిన నటులు ఒకే సినిమాలో నటిస్తుం డటంతో ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ సంగీతం అంది స్తున్నా రు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రైమ్‌మార్క్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నాయి. మధురైలో ప్రారం భోత్సవ కార్యక్రమం పూర్తవడంతో త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. సినిమాకు సంబం ధించిన కథ, విడుదల తేదీ తదితర వివరాలను చిత్రబృందం త్వరల ో వెల్లడించ నుంది. మరోవైపు ధనుష్ నటిం చిన 'ఓం' చిత్రం నవంబర్‌లో థియే టర్లలో విడుదలకు సిద్ధమవు తోంది. ఒకవైపు తన సినిమాల విడుదలకు సన్నద్ధ మవుతూనే.. మరోవైపు కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ధనుష్ వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్నారు.

Apublished by **KALIDINDI SUMALATHA**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by **RAGHURAMA RAJU KALIDINDI** and printed by **KALIDINDI SUMALATHA** at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467